ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 211    మంగళవారం 11 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## నా రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు



- కైకలూరులో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- భూ కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం పాడతామని హామీ
- వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తోందని తీవ్ర విమర్శ
- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ఉపేక్షించేది లేదని, పోలీసులపై దాడులు సహించబోమని హెచ్చరిక
- ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ అందిస్తామని, 10 ఎకరాల నిబంధన రద్దు చేశామని ప్రకటన

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)**

రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.

**భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి, నేరుగా ప్రజల వద్దకే వచ్చి పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటివరకు 7,450 గ్రామాల్లో 32 లక్షల మందికి పైగా రైతులకు అత్యాధునిక భద్రతా ఫీచర్లతో, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు అందించామని వెల్లడించారు. గత ప్రభుత్వం తమకు ఇష్టం లేని వారి భూములను 22-ఏ జాబితాలో చేర్చి, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు.

తమ ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 41 వేల ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి చేసి 25 వేల మంది రైతులకు న్యాయం చేసిందని తెలిపారు. కైకలూరులోనే సుమారు 2,838 ఎకరాలను 1,848 మంది రైతులకు అప్పగించామని చెప్పారు. "మీ భూమిపై మీకే హక్కు ఉండాలి. వేరేవాళ్ల పెత్తనం గానీ, వారి ఫోటోలు గానీ ఉండటానికి వీల్లేదు. ఈ సమస్యను పరిష్కరించే వరకు ▶2లో

## ఇంటింటా జాతీయ జెండాను ఎగరేయండి: మోదీ



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 10)**

మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు.

**క్విట్ ఇండియా ఉద్యమకర్తలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి**

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు.

**వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోం: కేరళ**

కాసర్‌గోడ్: తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

## 'మీ భూమి-మీ హక్కు'..

### పట్టాదారు పాస్ బుక్ లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు



- ఏలూరు జిల్లాలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలు ఆదరిస్తారని వ్యాఖ్య
- లేకపోతే గత ప్రభుత్వంలా 11 సీట్లకే పరిమితం కావాల్సి వస్తుందని హెచ్చరిక
- భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- కొత్త పాస్‌బుక్‌లకు బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో భద్రత

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)**

ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించినప్పుడే జనం జై కొడతారని, లేకపోతే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం బటన్లు నొక్కి, పరదాల చాటున తిరిగితే ప్రజలు ఆదరించరని, ▶2లో

## విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు.. పార్లమెంట్‌లో కేంద్రం హామీ

- విద్యార్థులపై పోలీసుల చర్యపై పార్లమెంట్‌లో మాట్లాడనున్న అమిత్ షా
- ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చకు సిద్ధమైనట్లు ప్రభుత్వం ప్రకటన
- ప్రతిపక్షాలు గందరగోళం చేయొద్దని రిజిజు విజ్ఞప్తి
- జూన్ 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసన



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 10)**

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సమాధానం ఇవ్వనున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ▶2లో

## వైసీపీ రౌడీ మూకలు రాజకీయ హత్యలకు పాల్పడుతున్నాయి

- కర్నూలులో కలకలం రేకెత్తించిన ఇంతియాజ్ హత్య
- జిల్లాలో వైసీపీ రౌడీ మూకలు హత్యాయత్నాలు చేస్తున్నాయన్న భరత్
- వైసీపీ నేతలు చేసిన అక్రమ భూకబ్జాలను ఇంతియాజ్ బయటపెట్టారని వెల్లడి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)**



కర్నూలులో టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేకెత్తించింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైసీపీ నాయకులు రాజకీయ హత్యలు, అరాచకాలకు పాల్పడుతున్నారంటూ ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లాలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... జిల్లాలో వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. పక్కా పథకం ప్రకారమే టీడీపీ కార్యకర్త ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు ఇంతియాజ్ నామినేషన్ వేసినప్పుడు వైసీపీ వర్గీయులు బెదిరింపులకు దిగారని, ఆ తర్వాత ఆయన టీడీపీలో చేరారని మంత్రి వెల్లడించారు. హంద్రీ నదిలో వైసీపీ నేతలు చేసిన అక్రమ ▶2లో

## లండన్ లో మంత్రి నారాయణ బృందం..

### ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై కీలక చర్చలు

### అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వెలుపలి డిజైన్లపై చర్చించనున్న బృందం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించనున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై స్పష్టతనిచ్చేందుకు ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం లండన్‌లో పర్యటిస్తోంది. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం (సెక్రటేరియట్) టవర్ల వెలుపలి డిజైన్ల ముసాయిదాను ఖరారు చేయడంపై ఆర్కిటెక్ట్‌లు, ప్రముఖ కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి నారాయణ కీలక సమావేశాలు నిర్వహించనున్నారు.ఈ పర్యటనలో భాగంగా ఐకానిక్ భవనాల డిజైన్లు రూపొందించిన నార్మన్ అండ్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, బ్యూరో హాపోల్డ్ కన్సల్టెన్సీ, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించే ఎత్తైన టవర్ డిజైన్‌పై ప్రధానంగా చర్చ జరగనుంది. అమరావతి నగరాన్ని వీక్షించేలా దీనిని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. మంత్రి నారాయణతో పాటు సీఆర్డీయే కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు ఈ లండన్ పర్యటనలో పాల్గొన్నారు.

## ఆర్జీకర్ ఘటనపై తాజా దర్యాప్తు

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 10)**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ హత్యాచార కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై మరోసారి తాజా దర్యాప్తునకు ఆదేశించినట్లు బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రకటించారు. మృతురాలి తల్లి, ప్రస్తుత భాజపా ఎమ్మెల్యే రత్న దేబ్‌నాథ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసులు తమ విధి నిర్వహణలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. 'ఈ కేసులో కొత్తగా దర్యాప్తు జరపాలని కోరుతూ రత్న దేబ్‌నాథ్ నాకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే సీఎస్‌తోపాటు నిపుణుల బృందంతో విస్తృత చర్చల అనంతరం.. మరోసారి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశా' అని సీఎం సువేందు పేర్కొన్నారు. ▶2లో

## హర్మూజ్ జలసంధిపై వీడని ఉత్కంఠ..

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 10)**

ఇరాన్‌తో తాము 'పాక్షికంగానే చర్చలు' జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్యకు ఆదేశించే బదులు, ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచడానికే తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. యాక్సియోస్ వార్తా సంస్థతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్, ఈ విషయాన్ని తాము పెద్దదిగా చేయడం లేదని అన్నారు. ఆర్థికంగా ఇరాన్ చాలా బలహీనమైన స్థితిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను ▶2లో

## చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుపాను.. సురక్షిత ప్రాంతాలకు 10లక్షల మంది

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 10)**

చైనాలో భారీ వర్షాలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. శక్తివంతమైన డాల్ఫిన్ తుపాను తీరాన్ని తాకడంతో ఆ ప్రాంతం వణుకుతోంది. భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగి పడటం, వరదలు పోటెత్తే ప్రమాదం ఉండటంతో



తీరప్రాంత నగరాల్లోని దాదాపు 10లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 1,500కు పైగా తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. షాంఘైలో గత 24 గంటల వ్యవధిలో దాదాపు 313 మిల్లీమీటర్ల వర్షపాతంనమోదయ్యింది. గత 150 ఏళ్ల చరిత్రలో ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు పేర్కొన్నారు. వందకు పైగా వీధులు జలమయం అవ్వడంతో ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రధాన విమానాశ్రయాల్లో 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. కొండచరియలు ▶2లో

## ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై నిర్వాసితుల తరపున ఎమ్మెల్యే గళం

### న్యాయం జరిగే వరకు పోరాడతామని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఆగస్టు 10)

సుంకేసుల, చింతల ఉడిపి, గుండ్లచర్ల, కలనూతల గ్రామాల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ బాధితులకు తక్షణమే పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఎమ్మెల్యే శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కలెక్టర్ కార్యాలయానికి స్వయంగా వెళ్లి అధికారులతో చర్చించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆమెతో ఫోన్లో మాట్లాడి, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు వారి న్యాయమైన డిమాండ్లను జిల్లా యంత్రాంగం దృష్టికి బలంగా తీసుకెళ్లారు. 2026 ఆగస్టు నాటికి 18 ఏళ్ళు నిండిన 1,500 మందికి పైగా యువతకు ఆర్ ఌ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి. ఇప్పటివరకు అవార్డు పొందని 500కు పైగా కుటుంబాలకు వెంటనే పరిహారం అందించాలి. వారికి స్పష్టమైన హామీ ఇవ్వకుండా ప్రాజెక్ట్ పేరుతో నీటిని విడుదల చేయడం సరికాదు. ఇళ్లు, సామాన్లు, జీవనోపాధిని మార్చుకోవడానికి ప్రజలకు కేవలం 10 రోజులు మాత్రమే సమయం ఇవ్వడం తీవ్ర అన్యాయం. గ్రామాలను ఖాళీ చేయడానికి కనీసం 3 నెలల సమయం ఇవ్వాలి. ప్రజల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎమ్మెల్యే చంద్రశేఖర్ హెచ్చరించారు. గ్రామస్తుల ప్రతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్ ఌ ఆర్ ప్యాకేజీ అందే వరకు వారి తరపున క్షేత్రస్థాయిలో పోరాడతానని హామీ ఇచ్చారు. అవసరమైతే గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని, న్యాయం జరిగే వరకు విరామం లేదని స్పష్టం చేశారు.

## ప్రకాశం జిల్లా ఆర్ఎంపి యూనియన్ నూతన అధ్యక్షుడిగా ఇమామ్ సాహెబ్ బాధ్యతల స్వీకారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)

ప్రకాశం జిల్లా ఆర్ఎంపి యూనియన్ నూతన అధ్యక్షుడిగా సయ్యద్ ఇమామ్ సాహెబ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు, నాయకులు, స్థానిక ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇమామ్ సాహెబ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. యూనియన్ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ, సంఘం బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన యూనియన్ పెద్దలకు, సహచర సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో రోగుల కష్టాలు తీరేదెన్నడో

### అదనపు గదులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 10)

సోమవారం ఉదయం ఉప్పుటూరులోని ప్రభుత్వ హోమియో వైద్యశాలలో రోగులు గంటల తరబడి వేచి ఉండి, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పాలేరు సీతారామమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాలేరు సీతారామమ్మ మాట్లాడుతూ ఇక్కడ సిబ్బంది కొరత కారణంగా డాక్టర్ ఒక్కరే అన్ని పనులు చేయడం వల్ల రోగులకు వైద్య సేవలు అందడంలో ఆలస్యం అవుతుందని, దూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులు కూడా గంటలు తరబడి వేచి ఉండవలసి వస్తుందని, అదనపు వైద్య సిబ్బందిని నియమించి తమకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సహాయ పడగలరని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉప్పుటూరు సచివాలయంలోని ఒక చిన్న గదిలోనే గత ఏడాదిన్నరగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల సేవలు ప్రజలకు అందించబడుతున్నాయని, ప్రస్తుతం రోజుకు కనీసం 30 నుంచి 50 మంది రోగులు వైద్య సేవలు వినియోగించుకుంటున్నారని, సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, బెంగుళూరు, ఒంగోలు, మేదరమెట్ల, చీరాల, తెనాలి వంటి ప్రాంతాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వస్తున్నారని, కానీ కనీస మౌలిక సదుపాయాలు మరియు అదనపు వైద్య సిబ్బంది లేని కారణంగా ప్రజలు గంటలు తరబడి వేచి ఉండవలసి వస్తుందని, దీనివల్ల నేను ముందు వచ్చానంటే నేను ముందు వచ్చానని అప్పుడప్పుడు గొడవలు కూడా పడుతున్నారని, ఈ నేపథ్యంలో తాను ఇదివరకే ఈ విషయాన్ని తన పై అధికారులకు విన్నవించి త్వరితగతిన అదనపు సిబ్బందిని డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించాలని కోరానని తెలిపారు.

## మొదటిపేజీ తరువాయి

## 'మీ భూమి-మీ హక్కు'..

### పట్టాదారు పాస్ బుక్ లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

అందుకే గత ప్రభుత్వాన్ని 11 సీట్లకే పరిమితం చేశారని పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏలూరు జిల్లా కలిదిండిలో సోమవారం నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, సుపరిపాలన అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌తో పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల భూ సమస్యలు తీవ్రమయ్యాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిష్కరించి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రీసర్వే చేపట్టినట్లు చంద్రబాబు వివరించారు. కొత్తగా అందిస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాలకు కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లతో పాటు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక సాంకేతికతను జోడించామన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు.ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 9,365 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేసి, 32.32 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని, మరో 68.64 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేయాల్సి ఉందని చంద్రబాబు వెల్లడించారు. ప్రతి నెలా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు.. పార్లమెంట్‌లో కేంద్రం హామీ

సోమవారం ప్రకటించారు. దీంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్టంభనకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశానికీ ప్రభుత్వం సమాధానం ఇస్తుందని చెప్పారు. ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా సభలో ఈ అంశంపై స్పందిస్తారని స్పష్టం చేశారు.

అయితే అమిత్ షా ప్రకటన సమయంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించకూడదని రిజిజు కోరారు. హోంమంత్రి సమాధానాన్ని పూర్తిగా వినాలని సూచించారు. చర్చ మొదలైన తర్వాత ప్రతి అంశంపైనా విస్తృతంగా మాట్లాడవచ్చని చెప్పారు.జూన్ 20న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసనపై పోలీసులు తీసుకున్న చర్యలను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. విద్యార్థులపై పోలీసులు అతిగా వ్యవహరించారని ఆరోపిస్తున్నాయి. పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన వార్తలపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ చర్యలు అమిత్ షా ఆదేశాలతో జరిగాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

అమిత్ షా నుంచి సమాధానం కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభలో వరుసగా నిరసనలు చేపడుతున్నారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే నినాదాలతో కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ గేట్ల వద్ద కూడా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.

## ఆర్జీకర్ ఘటనపై తాజా దర్యాప్తు

అదేవిధంగా బాధితురాలి అంత్యక్రియల నిర్వహణలో జరిగిన లోపాలపై ప్రత్యేక దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు ఈ ఘటనకు ఆదివారంతో రెండేళ్లు పూర్తి కాగా.. బాధితురాలికి నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. 2024 ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్యకళాశాల- ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జిషీట్‌లో చేర్చింది. కోల్‌కతాలోని సియాల్దా కోర్టు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధరించి.. జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన అరుదైన కేసు పరిధిలోకి రాదని, మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని తెలిపింది.

## చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుపాను..

## సురక్షిత ప్రాంతాలకు 10లక్షల మంది

విరిగిపడడంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు, రైలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చైనాలోని డాల్ఫిన్ తుపాను ప్రభావం తైవాన్, భారత్‌లపైనా పడే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీనివల్ల చైనా సరిహద్దుల్లో ఉన్న భారత భూభాగంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

## వైసీపీ రౌడీ మూకలు రాజకీయ హత్యలకు పాల్పడుతున్నాయి

భూకబ్జాలను ఇంతియాజ్ ధైర్యంగా బయటపెట్టారని, ఆ కక్షను మనసులో ఉంచుకునే దారుణంగా పొట్టనబెట్టుకున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రతీకారంతో హత్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు.

## నా రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు

నేను నిద్రపోను," అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**గొడ్డలి పార్టీపై నిప్పులు**

గతంలో తాను నక్సలిజం, ఫ్యాక్షనిజం, మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణిచివేశానని గుర్తుచేసిన చంద్రబాబు, ఇప్పుడు రాష్ట్రానికి "గొడ్డలి పార్టీ" రూపంలో కొత్త ముప్పు వచ్చిందని అన్నారు. "నా 48 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు. బాబాయ్‌ను గొడ్డలితో నరికి చంపి, ఆ నెపాన్ని నాపై వేయాలని చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ నాపైనే కథనాలు రాయించారు. నేను రౌడీలకు సింహస్వప్నం కానీ, నేను రౌడీయిజం చేయను. హత్య చేసినవాడు కూడా అదే విధంగా పోతాడనేది నా సిద్ధాంతం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.

గత ఐదేళ్లలో గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లు పెట్రేగిపోయాయని, ఇప్పుడు కూడా పోలీసులపై దాడులు చేస్తూ, రోడ్లపై విన్యాసాలు చేస్తూ శాంతిభద్రతలకు సవాల్ విసురుతున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళంలో బందోబస్తుకు వెళ్లిన ఒక మహిళా పోలీస్ అధికారిణిపై వైసీపీ శ్రేణులు దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. "ప్రజలను కాపాడే పోలీసులకే రక్షణ లేకపోతే, రాష్ట్రంలోని ఆడబిడ్డల పరిస్థితి ఏంటి? ఇలాంటి అరాచకాలను చూస్తూ ఊరుకోవాలా?" అని ప్రశ్నించారు.

మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని అభినందించాల్సింది పోయి, నీట్ కుంభకోణంతో ముడిపెట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని, దీనికి నిరసనగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులే రోడ్లపైకి వచ్చి వైసీపీకి బుద్ధి చెప్పడం శుభపరిణామమని అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా**

ఎన్డీయే ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్‌గా సూపర్ స్పీడ్‌తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ఆక్వా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం, జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి అనే తేడా లేకుండా అందరికీ యూనిట్ కరెంటును రూ.1.50కే అందిస్తామని, దీనికోసం రూ.1150 కోట్లు ఖర్చయినా వెనుకాడబోమని ప్రకటించారు. కైకలూరు నియోజకవర్గ తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.36 కోట్లు మంజూరు చేశామని, వీలైనంత త్వరగా సిమెంట్ రోడ్లు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

**అధికారులకు జవాబుదారీతనం**

సభా వేదికపైనే వివిధ శాఖల అధికారుల పనితీరును ఐవీఆర్ఎస్ డేటా ఆధారంగా సమీక్షించడం ద్వారా పాలనలో పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. బాగా పనిచేసిన వారిని అభినందించి, వెనుకబడిన వారిని హెచ్చరించారు. "నేను కష్టపడుతున్నాను, మీరు కూడా కష్టపడాలి. ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

చివరగా, "ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పేరుతో '...అనే నేను' అంటూ దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుతామని సంకల్పం తీసుకోవాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హర్మూజ్ జలసంధిపై వీడని ఉత్కంఠ..

నియంత్రించేందుకు అమెరికా, ఇరాన్, ఒమన్ మధ్య ఒక ఒప్పందం కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి కూడా స్పందించారు. హర్మూజ్ జలసంధిలో తాత్కాలిక సముద్ర మార్గం ఏర్పాటుపై ఒమన్‌తో తాము ఒక ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని తెలిపారు. ఇరు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించడం ఆపేంత వరకు ఆ దేశంతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అరాఘ్చి ఆదివారం టెహ్రాన్‌లో స్పష్టం చేశారు.

అయితే, ట్రంప్ వ్యాఖ్యలు గత కొన్ని రోజులుగా పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గత మంగళవారం ఆయన హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్‌తో తాము చాలా మంచి చర్చలు జరుపుతున్నామని చెప్పారు. కానీ, వాషింగ్టన్‌తో ఎలాంటి చర్చలు జరగడం లేదని టెహ్రాన్ వెంటనే ఖండించింది. సోమవారం కూడా ట్రంప్ మాట్లాడుతూ.. "శిరచ్ఛేదం చేసే ముందు ఇరాన్‌కు ఇదే చివరి అవకాశం" అని తీవ్రంగా హెచ్చరించారు. హర్మూజ్ జలసంధిని రేపటికల్లా తెరిచేలా చర్చలు జరుగుతున్నాయని చెప్పినప్పటికీ, ఇరాన్ దానిని తోసిపుచ్చింది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ సత్యానంద్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)





పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎ సత్యానంద్ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం ఒంగోలులోని దోనేపూడి రాఘవయ్య మున్సిపల్ హైస్కూల్ నందు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎ సత్యానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు వారి ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లను పెంచడం, నీటిని పొదుపుగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యల ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులు, సమాజంలోని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ సత్యానంద్, తాత్కాలిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు తదితరులు, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణకు విద్యార్థులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగాహనకు విస్తృత ప్రచారం

### "ఆరోగ్య కరదీపిక" ఐఈసీ కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)



ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగాహన పెంపొందించడం, అపోహలు, వివక్షను తొలగించడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన "ఆరోగ్య కరదీపిక", "హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన మనందరి బాధ్యత" అనే సందేశంతో కూడిన కరపత్రాలు, ఆరోగ్య సమాచారానికి సంబంధించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను సోమవారం ప్రకాశం భవన్‌లోని పిజిఆర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, చికిత్స, సంరక్షణ రంగాల్లో గత కొన్ని దశాబ్దాలుగా సాధించిన పురోగతి ప్రశంసనీయమన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయమైన, సరైన అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని మరింత నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి బాలాజీ మాట్లాడుతూ ఆగస్టు 12 అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు రెండు నెలలపాటు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ, హెచ్ఐవీ పరీక్షలు, చికిత్స, సంరక్షణ, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు తదితర అంశాల పై కరపత్రాలు, "ఆరోగ్య కరదీపిక", ఇతర సమాచార, విద్యా, కమ్యూనికేషన్ ,సామగ్రి ద్వారా అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ప్రకాశం జిల్లాతో పాటు రాష్ట్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగిన, అపోహలు మరియు వివక్ష లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని డాక్టర్ బాలాజీ తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి బాలాజీ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్, ఎస్ సాయి, జిఆర్వో ఎస్ఎసిఆర్‌డి ప్రోగ్రామ్ మేనేజర్లు ఎస్ పీర్ భాషా, వెంకటేశ్వర్లు, లింక్ వర్కర్స్ స్కీం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ గాలి సందీప్, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

11.08.26 మంగళవారం

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరారు చేసిన ధరకు పొగాకు కొనుగోళ్లు జరగాల్సిందే

కొనుగోళ్ల ప్రక్రియలో పొగాకు బోర్డు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

పొగాకు రైతులకు న్యాయం చేసేందుకు సీఎం చంద్రబాబు అన్ని విధాల కృషి చేస్తున్నారు

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**(షణ్ముఖ వెలుగు, గుంటూరు, ఆగస్టు 10)** పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, ధరలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, పొగాకు పండించే ప్రాంతాల శాసనసభ్యులు, పొగాకు బోర్డు చైర్మన్, ఈడీ, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రాంతాల రైతులతో సుమారు రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సమస్యలు, కంపెనీల కొనుగోలు తీరు, ధరల అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.....గుంటూరు టొబాకో బోర్డులో సహచర మంత్రులు శ్రీ అచ్చెన్నాయుడు గారు, శ్రీ గొట్టిపాటి రవి గార్లతో కలిసి పొగాకు

# దమ్ముంటే నా ఛాలెంజ్ స్వీకరించు ఇద్దరం ఇండిపెండెంట్‌గా పోటీ చేద్దాం

30 వేలు మెజార్టీ దాటకపోతే

మా కుటుంబం రాజకీయం నుండి తప్పుకుంటాం

మా కుటుంబం జోలికి వస్తే చూస్తూ ఊరుకోను

ఇసుక, రేషన్ దందాలలో డబ్బు తీసుకోలేదా

రెండేళ్ల కాలంలో ఒంగోలుకు చేసింది ఏమీ లేదు

ఎమ్మెల్యే దామచర్ల పై రాష్ట్ర మాజీ మంత్రి బాలినేని మాటల దాడి





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 10)** మగాడివైతే చంద్రబాబుతో చెప్పి మీ అవినీతిపై ఎంక్వైరీ వేయించుకో, అలాగే నా అవినీతి పై పవన్ కళ్యాణ్ కి చెప్పి ఎంక్వైరీ వేయించుకుంటా, దమ్ముంటే నా చాలెంజ్ స్వీకరించు అంటూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పై మాజీ రాష్ట్ర మంత్రి, జనసేన పార్టీ నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి మాటల దాడి చేశారు. ఒంగోలులోని బాలినేని స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలినేని మాట్లాడుతూ తన కుమారుడిని గంజాయి బ్యాచ్ అంటూ పదే పదే ప్రస్తావిస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. నన్ను నువ్వు అనే సంబోధించే స్థాయి దామచర్లకి లేదన్నారు. దామచర్ల అవినీతి చేయకపోతే మున్సిపల్ కార్యాలయంలో మిస్సయిన నగదును జమ చేయించాలని డిమాండ్ చేశారు. తాను పేకాట ఆడటం బహిరంగంగానే ఒప్పుకుంటున్నానని, అయితే దామచర్ల మాత్రం రాత్రి 8 గంటల తర్వాత భూ కబ్జాదారులతో కలిసి వేకువజాము మూడు గంటల వరకు ప్రతి రోజు మందు తాగుతూ గడుపుతారని, 11 గంటల వరకు నిద్ర లేవని, ఇది ఒంగోలు ప్రజలందరికీ తెలిసిన విషయమేనని విమర్శించారు. ఇసుక, రేషన్ దందాలలో వాటా లేదా అని ప్రశ్నించారు. గతంలో నాలుగు వేల రూపాయల ఉన్న ఇసుక, నేడు 5000కు అమ్మటం లేదా అని ప్రశ్నించారు. రేషన్ డీలర్లలో జనసేనకు ఒక్కరికి మాత్రమే రేషన్ షాపు కేటాయించారన్నారు. రియాజ్‌కు ఉడా చైర్మన్ పదవి ఇచ్చానని గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. రియాజ్ వెంటనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఉడ చైర్మన్ పదవిని పవన్ కళ్యాణ్ ఇప్పించారా, లేక ఎమ్మెల్యే దామచర్ల ఇచ్చారా అనేది తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబం ఒంగోలు ప్రజలకు అన్నం పెట్టిందే తప్ప, గంజాయి పంచింది కాదన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో దామచర్ల ఒంగోలుకు చేసింది ఏమీ లేదన్నారు. రోడ్ల పై రోడ్లు వేసారే తప్ప, రెండు చోట్ల గుర్రాల బొమ్మలు దాతల (తరువాయి 4లో...)

# దగా డీఎస్సీ అంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదు

అక్రమాలు జరగలేదని కోర్టులు స్పష్టం చేసినా

రాజకీయాల కోసం ధర్నాలు చేయడం దురదృష్టకరం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 10)** డీఎస్సీ 2025 నియామకాలపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణల పై మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు కందుల నారాయణరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముందుగా 2025 డీఎస్సీ అభ్యర్థులతో మార్కాపురం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ నుండి దోర్నాల బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ "దగా డీఎస్సీ" అంటూ ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని, ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కోర్టులు స్పష్టం చేసినప్పటికీ, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఆన్‌లైన్ విధానంలో, జంబ్లింగ్ సిస్టమ్ ద్వారా నిర్వహించే పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ కావడం సాధ్యం కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. (తరువాయి 4లో...)

# వెలుగొండ నిర్వాసితులు కలెక్టరేట్ వద్ద కన్నీటి పర్వం

వెలుగొండ నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కలెక్టర్ రేట్ వద్ద ధర్నా



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 10)** వెలుగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ముంపు గ్రామాల వారు ఖాళీ చేసేందుకు సమయం కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మార్కాపురం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులు అధిక సంఖ్యలో ర్యాలీగా (తరువాయి 4లో...)







# అర్జీల పరిష్కారంలో 'ఇన్ ప్రోగ్రెస్ అని కాలయాపన చేస్తే సహించేది లేదు

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 10)** కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 'మీ కోసం' ద్వారా 286 వినతుల స్వీకరణ ప్రతి అర్జీ చదివి నియమ నిబంధనలకు లోబడే అర్జీలను పరిష్కరించాలి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోగా, నాణ్యతతో పరిష్కరించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదనిజిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' హాలులో సోమవారం నిర్వహించిన (తరువాయి 4లో...)

# అర్జీల పరిష్కారంలో 'ఇన్ ప్రోగ్రెస్ అని కాలయాపన చేస్తే సహించేది లేదు

"మీ కోసం" కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా వినతిపత్రాలను స్వీకరించి, ఆయా సమస్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15 తరువాత నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నుండి నేరుగా అభిప్రాయాలు తీసుకుంటామని దీనిపై అధికారులతో చర్చిస్తామని ఆయన చెప్పారు. అధికారుల వద్ద 'ఇన్ ప్రోగ్రెస్ లో ఉన్న కేసుల సంఖ్యను తక్షణమే తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. పిటిషన్లను పరిష్కరించే క్రమంలో ప్రతీ అర్జీని చదివి నియమ నిబంధనలకు లోబడి మాత్రమే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. బాధితుడికి సంతృప్తికరమైన, శాశ్వతమైన పరిష్కారం లభించేలా క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి,జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటరమణ, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత, ప్రొబెషనరి డిప్యూటి కలెక్టర్ రాజా మధ్యూస్ తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## దమ్ముంటే నా ఛాలెంజ్ స్వీకరించు ఇద్దరం ఇండిపెండెంట్‌గా పోటీ చేద్దాం

సహకారంతో ఏర్పాటు చేశారే తప్ప ఆయన ఒంగోలుకు చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. దామచర్లకు దమ్ముంటే తనతో పాటు, ఒంగోలులో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచి నిరూపించాలని, 30 వేలు మెజార్టీ దాటకపోతే మా కుటుంబం రాజకీయాల నుంచి తప్పుకుంటుందని సవాల్ విసిరారు.

**ఇరువురు నేతలకు అధినేతలు సూచనలు :** అయితే ఇరు పార్టీల అధినేతలు బాలినేని, దామచర్లకు ఆరోపణలు చేసుకోవద్దని సూచన చేశారు. ఆరోపణలు ఉంటే పార్టీ అధినాయకత్వాల దృష్టికి తీసుకురావాలని బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల జనార్ధన్‌కు సమన్వయ కమిటీ సూచించింది. బాలినేని, దామచర్ల సమన్వయతంగా ఉండాలని, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు పునరావృతం కాకూడదని ఆదేశాలు ఇచ్చారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరారు చేసిన ధరకు పొగాకు కొనుగోళ్లు జరగాల్సిందే



రైతులు, కొనుగోలు వ్యాపారులు, పొగాకు బోర్డు అధికారులతో సమావేశమై పొగాకు కొనుగోళ్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించాం. రైతులకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరారు చేసిన ధరకు పొగాకు కొనుగోళ్లు జరగాలని స్పష్టం చేశాం. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలను వ్యాపారులు తప్పనిసరిగా గౌరవించాలని, కొనుగోళ్ల ప్రక్రియలో పొగాకు బోర్డు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించాం. రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశాం.రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. వ్యవసాయ శాఖ, పొగాకు బోర్డు సమన్వయంతో తక్షణమే కార్యాచరణ చేపట్టి బోర్డు అనుమతితో పొగాకు సాగు చేసిన రైతులతో పాటు అనుమతి లేకుండా సాగు చేసిన రైతులు, కౌలు రైతులు సహా అర్హులైన ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాల వడ్డీలేని రుణం అందించేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. లో గ్రేడ్ పొగాకు క్వింటా రూ.1000 రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తోంది. రైతులకు ఎప్పుడు కష్టం వచ్చినా అండగా నిలబడింది టీడీపీనే. 2015లో పొగాకు రైతులకు వయాబులిటీ గ్యాప్ ఫండ్ ఇచ్చి ఆదుకున్నాం. గతేడాది రూ.300 కోట్లతో బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# దగా డీఎస్సీ అంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదు




పరీక్షా విధానంపై అవగాహన లేకుండా పేపర్ లీక్ జరిగిందంటూ ఆరోపణలు చేయడం ద్వారా నిరుద్యోగ యువతలో అనవసరమైన గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ 2025 నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, కేవలం 45 రోజుల్లోనే ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు కల్పించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి అభ్యర్థుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని కందుల నారాయణ రెడ్డి అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలకు ఎమ్మెల్యే హితవు పలికారు. డీఎస్సీ అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# వెలుగొండ నిర్వాసితులు కలెక్టరేట్ వద్ద కన్నీటి పర్వం



కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం గేటును తోసుకుంటూ కలెక్టరేట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో నిర్వాసితులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం కో కన్వీనర్ దగ్గుబాటి సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో ప్రజలకు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు సమయం ఇవ్వాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# కదిరి బాబురావు జన్మదినం సందర్భంగా రోగులకు అన్నదానం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)

మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులతో పాటు ఆహార వసతి లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఉచితంగా భోజనం అందించారు. ట్రస్ట్ కన్వీనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ మాజీ ఎమ్యెల్యే కదిరి బాబురావు జన్మదినం సంధర్భంగా పేదలకు ఆహారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కదిరి బాబురావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ పులి శాంతి, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు ఎస్వి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ రహీమ్, మాజీ ఎంపీటీసీలు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, షేక్ జిలాని బాషా, మాజీ కౌన్సిలర్స్ షేక్ ఫయాజ్, షేక్ రహీమ్, మండల రైతు అధ్యక్షులు ముల్లంగి శ్రీహరిరెడ్డి, కనిగిరి పట్టణ కార్యదర్శి బొట్టు శ్రీను, వైసీపి వాలంటీర్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మాజీ మెంబర్ షేక్ షరీఫ్, కటకం లచ్చేసు, కనిగిరి వాణిజ్య విభాగం కార్యదర్శి ఫణింద్ర బాబు, ముత్యాల ప్రతాప్, మాజీ కౌన్సిలర్ దాసరి మురళీ, మార్తాల రామురెడ్డి, చాగంరెడ్డి అమర్నాథ్‌రెడ్డి, ఖాదర్ బాషా, టివి మస్తాన్‌వలి, షేక్ రషీద్, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు ఖాసీంసా, మదార్ వలి, కరీముల్లా, ఖాదర్ జిలాని, షేక్ గని, షరీఫ్, రహిమాన్, రషీద్, చిల్లా సాయి, తిప్పులూరి రాధాకృష్ణారెడ్డి, భారత్ గ్యాస్ సంధాని, చొప్పవరపు సుబ్బయ్య, బద్దెల నరసింహ, కందే స్వామి, కేతినేని రాంబాబు, సిహెచ్ ఏడుకొండలు, రామ్మోహన్, కిషోర్, బద్రి, చందా వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అద్దంకిలో పోలీస్ మీకోసం కార్యక్రమం

## ప్రజలకు మరింత చేరువగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

## అద్దంకిలో నిర్వహించిన 'పోలీస్ మీకోసం' కార్యక్రమానికి విశేష స్పందన

## 64 ఫిర్యాదుల స్వీకరణ

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 10)

ప్రజా ఫిర్యాదుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సోమవారం అద్దంకి పోలీస్ స్టేషన్ ఆవరణలో 'ప్రత్యేక పోలీస్ మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అద్దంకి పట్టణంతో పాటు చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వినతులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. అనంతరం వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకుని, ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో పరిశీలించి, సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టప్రకారం పారదర్శకంగా సమగ్ర విచారణ నిర్వహించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను రిపోర్ట్ పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం కోసం అద్దంకిలో 'పోలీస్ మీకోసం' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందిన ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించే విధంగా ముందుకు అడుగు వేస్తున్నామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే ఇబ్బందులను తగ్గించి, ప్రజలు తమ ప్రాంతానికి సమీపంలోనే పోలీసు అధికారులను కలిసి ఫిర్యాదులు తెలియజేసే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దూర ప్రాంతాల ప్రజలు ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయానికి దూర ప్రయాణం చేయాల్సిన అవసరం లేకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ప్రజాఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి స్థాయి విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, భూ, ఆస్థి వివాదాలు, ఇతర సమస్యల పై ఫిర్యాదులు అందాయి. అదే విధంగా ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు నిర్వహించిన మీకోసం కార్యక్రమంకు 74 ఫిర్యాదులు అందినాయి. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, సంతమాగులూరు సీఐ శేషగిరిరావు, దర్శి సీఐ రామారావు, అద్దంకి సబ్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.






# ఓ మహిళ నీకు సెల్యూట్...

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఆగస్టు 10)



మండల పరిషత్ అధికారిగా రాచపూడి రాజ్యలక్ష్మి తన సమర్థవంతమైన సుపరిపాలనతో ప్రజలకు దగ్గరయ్యారు. గ్రామాలలోని అభివృద్ధికి పాటు పడుతూ మరొకవైపు శానిటేషన్ పై దృష్టి సారించి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సుపరిపాలనలో తన మార్క్‌ను చాటుకున్నారు. తొలుత తన ప్రస్థానం హై స్కూల్ నుండి జూనియర్ అసిస్టెంట్‌గా మొదలై అంచలంచెలుగా ఎదుగుతూ మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్, ఏవోగా, ఎండిఓ గా ఉన్నత పదవులు అధిరోహించారు. పరిపాలనలో నిబద్ధత పాటిస్తూ, అధికారులతో సఖ్యతగా ఉండి పని చేయించడమే కాకుండా సమస్యలపై వచ్చిన ప్రజలకు చిరునవ్వుతో స్వాగతం పలుకుతూ సమస్యను సానుకూలంగా పరిష్కరించడంలో నైపుణ్యాన్ని చాటుకున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించే ఉత్తమ ఎండిఓగా వారి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. పరిపాలనలో ఎక్కడ అవినీతికి తావు లేకుండా, నిజాయితీగా పని చేసి మండలంలో మంచి గుర్తింపు పొందారు. నేటి పరిస్థితుల్లో ప్రజల మనసు గెలుచుకున్న అధికారులు కొంతమంది మాత్రమే ఉంటారు. అలాంటి వారి జాబితాలో ఎండిఓ రాజ్యలక్ష్మి స్థానం సంపాదించుకున్నారు. వృత్తిపరంగా కొన్ని ఒడిదుడుకులు వచ్చినప్పటికీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని వృత్తి పట్ల అంకితభావాన్ని చాటుకున్నారు. మొత్తం మీద తన పరిపాలన జీవితంలో ఎలాంటి మచ్చ లేకుండా ఈనెల 31వ తేదీన రిటైర్మెంట్ అవటం గర్వంగా ఉందని పలువురు అధికారులు తెలియజేశారు.

# ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి ఎమ్మార్పీఎస్ నేతకు దళిత నేత అరుణ్ దీప్ పరామర్శ



(షణ్ముఖ వెలుగు, కంభం ఆగస్టు 10)

ఒకే కుటుంబంలో కొద్ది గంటల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాన్ని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ దీప్ చింతల పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల డానియెల్ మాదిగ చిన్నాన్న కుమారుడు, హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చాట్ల మణికుమార్ (43) ఈ నెల 6న అనారోగ్యంతో మృతి చెందారు. అదే రోజు సాయంత్రం ఆయన పెద్ద కుమారుడు చాట్ల క్లెయిమ్ స్టోన్ (23) రైలు కింద పడి మృతి చెందడం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో కంభం మండలం కందులాపురంలోని రావిపాడు రోడ్డులో ఉన్న వారి స్వగృహానికి వెళ్లిన అరుణ్ దీప్ చింతల, చాట్ల డానియెల్ మాదిగతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి బాధను పంచుకుని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఒకే కుటుంబంలో కొద్ది వ్యవధిలో ఇద్దరిని కోల్పోవడం తీవ్రంగా కలిచివేసిందని అరుణ్ దీప్ చింతల అన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అరుణ్ దీప్ వెంట ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు చెరుకుపల్లి రవితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన న్యాయవాది నాగ ప్రవీణ్



(షణ్ముఖ వెలుగు, కారంచేడు, ఆగస్టు 10)

కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది వంకాయలపాటి నాగ ప్రవీణ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించింది. ఈ సందర్భంగా నాగ ప్రవీణ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. తనను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి నాగ ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# పెదకొత్తపల్లిలో ఇంటింటికీ టీడీపీ మహిళలు హారతులతో ఆహ్వానం





**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, ఆగస్టు 10)**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమంలో భాగంగా

## రెండేళ్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్



మద్దిపాడు మండలం పెదకొత్తపల్లి గ్రామంలో మద్దిపాడు మండల సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి.ఎస్.ఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు మహిళలు ఇంటింటా హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

**రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పెదకొత్తపల్లి గ్రామంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో పలు సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, అంజయ్య నగర్‌లో కమిటీ హాల్ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పెదకొత్తపల్లి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ ఆడక స్వాములు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, పార్లమెంట్ సెక్రటరీ దార్ల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, కో క్లస్టర్ ఇంచార్జి నల్లూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జి శివకృష్ణ, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, గట్టినేని అయన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రసాద్, మాజీ సర్పంచ్ కాకి శైలజ, పోతినేని శిరీష, బొమ్మల చిరంజీవి, జనసేన నాయకులు చిరంజీవి, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## జీవోను అమలు చేయకుండా అధికారుల నిర్లక్ష్యం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)**

టంగుటూరు ప్రాజెక్టు పాకల గ్రామంలో హెల్పర్ నుంచి వర్కర్‌గా ప్రమోషన్‌కు అర్హత ఉన్నటువంటి జ్యోతిని కాదని సర్టిఫికెట్స్ ఆఫీస్‌కి ఇచ్చినప్పటికీ పరిగణలోకి తీసుకోకుండా నోటిఫికేషన్ వేసిన సందర్భంగా ఆగస్టు ఒకటో తారీకు నుంచి నిరసన దీక్ష జిల్లా పిడి ఆఫీస్ దగ్గర యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్నారు. సోమవారం జిల్లా పిడి ఆఫీస్ దగ్గర జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ ఇందిరా రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో అర్హత ఉన్నటువంటి హెల్పర్స్ కు పోరాడి సాధించుకున్నటువంటి జీవోను అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిని మేము ఖండిస్తున్నాం వెంటనే ఆమెకు ప్రమోషన్ ఇవ్వాలని దీక్షను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేదర అన్నపూర్ణ మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ కాన్స్టెన్సీ లోనే గౌరవ వేతనం తీసుకుంటూ సేవ చేసేటువంటి అతి పేద హెల్పర్ కు న్యాయం జరగకుండా అక్రమంగా అధికారులు నోటిఫికేషన్ వేస్తా ఉన్నారు ఇది చాలా అన్యాయం వెంటనే నోటిఫికేషన్లు రద్దు చేసి ఆమెకు ప్రమోషన్ను ఇవ్వాలని అలాగే జిల్లాలో ఉన్న అర్హత కలిగిన ప్రతి హెల్పర్ కు ప్రమోషన్ ఇవ్వాలని యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు క్రాంతి నాగమ్మ, సుశీల, తిరుపతమ్మ, హెల్పర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించాలి

**సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రబాబు**




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)**

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించాలని సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎనుబరి రవీంద్రబాబు అన్నారు. సోమవారం కనిగిరి పట్టణంలో సిపిఐ, ఎఐటీయుసి, వివిధ సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టభద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో వ్యవసాయ కూలీలకు నిరంతర ఉపాధి లభించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోవడానికి వేలాది మంది వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వ్యవసాయ కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించి వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పనిదినాలను పెంచి రోజుకు 700 కనీస వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆలోపు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువుల రేట్ల కనుగుణంగా స్కీం వర్క్ కార్మికులందరికి వేతనాలు పెంచి కనీస వేతనం 31 వేలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే ఉపసంహారించాలన్నారు. తొలుత దరిశి చెంచయ్య భవనం నుండి పట్టణంలోని ప్రధాన వీధులైన చెప్పుల బజారు, పామూరు బస్టాండ్, తీగలగొంది, ఎంఎస్ఆర్ రోడ్డు తదితర ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గులాం హుస్సేన్, ఎఐటీయుసి నాయకులు ఖాసీంవలి, గుజ్జుల బాలిరెడ్డి, నాసర్, ఖాదర్ వలి, కిరణ్, మాలి, పవన్ కుమార్, శానిటరీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు చిన్నక్క, బుజ్జి ,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు దీపిక, తదితరులు పాల్గొన్నారు.

# దర్శి సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పనితీరు పై సమీక్ష సమావేశం

**జిల్లా వ్యాప్తంగా ప్రాపర్టీ నేరాల నియంత్రణ, ముద్దాయిలను పట్టుకోవడంలో**

**క్రైమ్‌లో నైపుణ్యం కలిగిన 50 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాల ఏర్పాటు**

**నేర తీవ్రత ఆధారంగా 8 ప్రత్యేక బృందాల ఏర్పాటు**

**ప్రతి బృందానికి ప్రత్యేక బాధ్యతలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది కేటాయింపు**

**గత ఏడు నెలల్లో 150 ప్రాపర్టీ నేరాలను ఛేదించి, 90 మంది ముద్దాయిలు అరెస్టు**

**దొంగతనం చేసిన సొత్తు రికవరీ – జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**






**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 10)**

మార్కాపురం జిల్లాలో దొంగతనం కేసుల నియంత్రణ, కేసులు చేదించటంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సోమవారం అద్దంకి పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా క్రైమ్ డేటాను సమగ్రంగా విశ్లేషించి, దొంగతనాల కేసుల ఛేదన కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ బృందాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు, వివిధ కోణాల్లో దర్యాప్తు, నేరస్తుల కదలికల పై నిఘా, జైలు మానిటరింగ్ తదితర చర్యల ద్వారా కేసులను ఛేదించేలా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలో దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, 90 మంది నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైన సొత్తును రికవరీ చేయడంతో పాటు సుమారు 150 కేసులను ఛేదించామని ఎస్పీ తెలిపారు. అలాగే, ఇటీవల అద్దంకిలోని ఒక దేవాలయంలో జరిగిన దొంగతనం కేసును కేవలం రెండు రోజుల్లోనే ఛేదించి నిందితులను పట్టుకున్నామని తెలిపారు. నేరాల నియంత్రణలో పోలీసుల సాంకేతిక సామర్థ్యంతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో సీసీ కెమెరాలను వినియోగించుకోవాలని, ఎల్ హెచ్ ఎంఎస్ పై అవగాహన కలిగి ఉండాలని, విలువైన నగదు, బంగారు ఆభరణాలు తదితర వస్తువులను బ్యాంకులో భద్రంగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. నేరాలను అరికట్టడంతో పాటు, ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందన్నారు.

**అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు :** అద్దంకి పట్టణంలోని భవాని సెంటర్‌తో పాటు ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలను గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చోట్ల ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**గోపాలపురం వద్ద రహదారి సమస్యకు పరిష్కారం :** అద్దంకి మండలం గోపాలపురం వద్ద గత 15 సంవత్సరాలుగా రహదారి గుంతల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ పి రాజబాబు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించామన్నారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుని రోడ్డును వేయించడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గోపాలపురం గ్రామస్థులు చెప్పిన వెంటనే స్పందించి రోడ్డు చేసినందుకు సహకరించినందుకు ఎస్పీని, అద్దంకి సీఐని సన్మానించారు.

## ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో పాటు నూతన జిల్లా అభివృద్ధికి తోడ్పాటును అందించండి

**ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఆగస్టు 10)**

జిల్లా కేంద్రమైన మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్ , డిగ్రీ కళాశాల, విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నూతన జిల్లా అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ముఖ్యంగా పేద విద్యార్థులు ప్రైవేటు కాలేజీలలో ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారని అన్నారు. ఆర్థికంగా మార్కాపురం జిల్లా వెనుకబడినప్పటికీ విజ్ఞానవంతులకు ఏమాత్రం కొదవలేదని, ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేస్తే ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందుతుందని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలంటే 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగార్జున యూనివర్సిటీ గాని , 100 కిలో మీటర్ల ఉన్న ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీలకు గాని వెళ్ళాల్సి వస్తోందని అన్నారు. మార్కాపురం ప్రాంతంలో నూతన పరిశ్రమలను స్థాపించాలని, తద్వారా యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

**"ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన శాసనాల".**

వెనుకబడిన రాయలసీమ జిల్లాలతో పాటు మార్కాపురం జిల్లాను కూడా హార్టీకల్చర్ హబ్ లో చేర్చడం పట్ల, ముఖ్యంగా పూల సుబ్బయ్య, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడం హర్షణీయమని, ప్రాజెక్టు నిర్మాణం పట్ల చిత్తశుద్ధితో కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం కృతజ్ఞతలు తెలిపారు.

# మండలంలో వైసీపీకి షాక్ టీడీపీలో చేరిన 13 కుటుంబాలు



**(షణ్ముఖ వెలుగు, హెచ్ఎంపాడు, ఆగస్టు 10)**

మండలంలోని వీర్రాంపురం గ్రామానికి చెందిన 13 వైకాపా కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో కనిగిరి అమరావతి మైదానంలో తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో కనిగిరి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ సహకారంతో మరింత ముందుకు తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతలపాడు మండల టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, నాయకులు కోటపాటి శేషయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహనతోనే నియంత్రణ సాధ్యం

## జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా
## ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు
## జిల్లావ్యాప్తంగా విస్తృత చైతన్య కార్యక్రమాలు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 10)

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 12 నుంచి అక్టోబరు 12 వరకు రెండు నెలల పాటు జిల్లావ్యాప్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగిక వ్యాధులు, మాదకద్రవ్యాల వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో "మోబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష" (ఎంఏఎస్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న రెండు నెలల అవగాహన కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను జిల్లాలో ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎన్జీవోలు, ఐసీటీసీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, రెడ్ రిబ్బన్ కళాశాలలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అధిక ప్రమాద గ్రామాలు, కళాశాలలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ప్రజలు, యువత, విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవీ పరీక్షలు, చికిత్సపై చైతన్యం తీసుకురావాలని సూచించారు.

**95.95.99 లక్ష్యాల సాధనపై దృష్టి..**

హెచ్ఐవీ పరీక్షల లక్ష్యాన్ని కనీసం 95 శాతానికి చేర్చాలని, హెచ్ఐవీ ఉన్న వారిలో 95 శాతం మందికి చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో వైరల్ లోడ్ నియంత్రణకు సంబంధించి 99 శాతం లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. హెచ్ఐవీపై అపోహలను తొలగించి, వ్యాధి నిర్ధారణ, చికిత్స




అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

**ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, లింక్ వర్కర్ పథకం సిబ్బంది సహకారంతో జిల్లాలోని ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళాశాలల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో, పాఠశాలలు, వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. హెచ్ఐవీ పరీక్షలు, లైంగిక వ్యాధులు, సురక్షిత పద్ధతులు, కండోమ్ వినియోగం, టోల్‌ఫ్రీ నంబర్ 1097, హెచ్ఐవీ చట్టం 2017, హెచ్ఐవీపై ఉన్న అపోహలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ, లైంగిక వ్యాధులపై ప్రజల్లో పరిజ్ఞానం పెంపొందించడం, సురక్షిత పద్ధతులపై అవగాహన కల్పించడం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల వివక్షను తగ్గించడం, ఎక్కువ మంది హెచ్ఐవీ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, ఇన్‌చార్జి జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎస్. ప్రవీణ్, డీపీఎంఓ డాక్టర్ తాహర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హీరందీర్, జిల్లా పరిషత్ సీఈఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిపాలనాధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వేమపల్లె భాస్కర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ అంజినేయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టీఐఎన్‌జీఓ, దిశ సిబ్బంది, జిల్లా సహాయోగి (న్యాకో) వి విజయ్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎపిజీఇఎ నూతన జిల్లా కార్యవర్గం



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 10)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా యూనిట్‌కు నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్షుడు జివివి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గం తరపున కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జివివి రాఘవరెడ్డి అధ్వర్యంలో సభ్యులు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సర్వీస్ సమస్యలు, కార్యాలయాల్లో ఎదురవుతున్న పరిపాలనా ఇబ్బందులు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను జిల్లా కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా నూతన కార్యవర్గం, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జివివి రాఘవరెడ్డి, జిల్లా కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జివివి రాఘవరెడ్డి, జిల్లా కార్యదర్శి జి రవికుమార్, ట్రెజరర్ పివి సందీప్, ఆర్గనైజ్ సెక్రటరీ జ్యోతి, అసోసియేట్ ప్రెసిడెంట్ కెవిఎస్ మారుతి ప్రసాద్, ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీస్ రవిచంద్ర, ఎ శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డి, బాపట్ల తాలూకా అధ్యక్షుడు శివరామకృష్ణ, చీరాల తాలూకా సెక్రటరీ దేవరకొండ దినేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శంకరంబాడి, పింగళి, చెళ్లపిళ్ల, ఠాగూర్ల నివాళి సభ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

స్థానిక ఒంగోలులోని బాలాజీరావుపేటలో పోలేరమ్మ గుడి ప్రక్కన ఉన్న ఆదిత్య డిగ్రీ కాలేజీలో "జాతీయ సేవా పథకం" (యన్.యస్.ఎస్) కార్యక్రమాలలో భాగంగా ఆగస్టు 10న సోమవారం సాయంత్రం 4.30 గంటలకు మన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 150వ,మాతెలుగు తల్లికి మల్లెపూదండ గేయం రచయిత శంకరంబాడి సుందరాచారి 112వ, తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి 156వ జయంతులతో పాటు భారతదేశ జాతీయగీతం "జన గణ మన" గేయ రచయిత రవీంద్ర నాథ్ ఠాగూర్ 85వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిదప కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ నూనె అంకమ్మరావు సభకు అధ్యక్షత వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కె సురేష్ మాట్లాడుతూ భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గేయం రచయిత శంకరం బాడి సుందరాచారులు, రవీంద్రనాథ్ ఠాగూర్, చెళ్లపిళ్ల వారు చాలా గొప్ప వాళ్ళని, చరిత్రలో వాళ్ళంతా చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తులని తెలిపారు. మరొక అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక శక పురుషుడని, యుగకర్తని,తిరుపతి వేంకట కవుల లో ఒకరిగా,తెలుగు సాహిత్యాన్ని పండితుల పరిధి దాటించి ప్రజల వద్దకు తీసుకెళ్లిన మహనీయుడని చెప్పారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆంధ్రోపన్యాసకులు, కళామిత్ర మండలి ( తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ఠాగూర్ గురించిమాట్లాడుతూ నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి ఆసియా వాసిగా చరిత్ర సృష్టించారని, భారతదేశ జాతీయగీతం "జన గణ మన", బంగ్లాదేశ్ జాతీయగీతం "అమర్ సోనార్ బంగ్లా" ఆయన రచనలేనని తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో ప్రసిద్ధమైన శాంతి నికేతన్ (విశ్వభారతి విశ్వవిద్యాలయం) స్థాపించిన వారు ఠాగూర్ అని, పింగళి వెంకయ్య గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని తెలిపారు. ప్రముఖ కవి యువి రత్నం ప్రసంగిస్తూ శంకరంబాడి సుందరాచారి గొప్పకవియని పద్య కవిత్వం ఆయనకు ప్రీతిపాత్రమైన కవితా ప్రక్రియని, అన్ని పద్యాలలోనూ తేటగీతి అంటే ఆయన ఎంతో ఇష్టపడ్డ ఛందస్సు అని తెలిపారు. ముందుగా నలుగురు మహనీయుల కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించిన ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఈఆదిత్య డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కోటేష్, యన్‌యస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి శ్రీనివాసులు, రంగస్థల నటులు మిడసల మల్లిఖార్జునరావు, గుంటూరు సత్యనారాయణ, కేయస్వీ ప్రసాద్, కోవెలకుంట్ల బాలకోటయ్య, ఓరుగంటి ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రబాబునాయుడుకి ఏమాత్రం బాధ్యత ఉన్న తన కుమారుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ తో రాజీనామా చేయించాలి

### నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్
### రాష్ట్రాన్ని జిమ్మిక్కులతో నడుపుతున్న అబ్బా కొడుకులు
### పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 10)



వైయస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి పై ఆరోపణలు వస్తే సిబిఐతో ఎంక్వయిరీ చేయుంచుకొని ఆరోపణలు నిరూపణ అయితే శిక్షించమని సవాలు విసిరాడు. చేతనైతే చంద్రబాబు నాయుడు నీ కుమారుడి పై వస్తున్న అవినీతి, ఆరోపణలకు బాధ్యత వహిస్తూ డీఎస్సీ అభ్యర్థులు నిరుద్యోగ యువత విద్యార్థులు డిమాండ్ మేరకు రాజీనామా చేయించు అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గం ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ సీఎం చంద్రబాబు నాయుడుకి సవాలు విసిరారు. డీఎస్సీలో జరిగిన అక్రమాల పై విచారణ జరపాలని జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీ, నీట్‌లో జరిగిన అవకతవకలపై అలాగే ఎవరైతే నష్టపోయారో దగాపడ్డారో వారికి సంఘీభావంగా కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, మేధావులు, వైఎస్ఆర్సిపి శ్రేణులు భారీగా తరలివచ్చి నిరసన ప్రదర్శన నిర్వహించారన్నారు. చంద్రబాబును ఒక్కటే అడుగుతున్నాను అయ్యా... చంద్రబాబు నాయుడు మీ కూటమి ప్రభుత్వంలో ఉన్న మోడీ పైన దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జంతర్ మంతర్ వేదికగా ఉద్యమం వస్తే దానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేయించారు. అదే విధంగా మన రాష్ట్రంలో డీఎస్సీ మెరిట్ లిస్ట్ పై స్పోర్ట్స్ కోట ఉపాధ్యాయుల నియామకంపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఆ శాఖను చూస్తున్న నీ కుమారుడు లోకేష్ తక్షణం రాజీనామా కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున నిరుద్యోగులు డిఎస్సి అభ్యర్థులు, విద్యార్థులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏమాత్రం చలనం లేకుండా విద్యాశాఖ మంత్రి పై వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చు అప్పుడు నిన్ను, నీ ప్రభుత్వాన్ని అభినందిస్తారు. సిబిఐ ఎంక్వయిరీ చేయమని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ మేము పోరాటం తప్పక చేస్తాము నిర్బంధాలకు, కేసులకు భయపడే పని లేదు నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన యువతరాన్ని ఆపాలనే దురుద్దేశంతో మా ఆఫీసులో కార్యక్రమం చేసుకుంటున్న మాపై పోలీసులు ద్వారా ఒత్తిడి చేస్తున్నారు. టి.డి.పి ఆఫీసు ఉందని అక్కడ మేము నడవకూడదు అంట ఈ ఆంక్షలు ఏంటి మేమేమన్నా దొంగలమా దొడ్డిదారిన పోవటానికి దొంగలు మీరు దోచుకుంటున్నది మీరు. రాష్ట్రాన్ని, కందుకూరు నియోజకవర్గానీ లూటీ చేస్తున్నారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు ఏది ఏమైనా తగ్గేదే లేదు కందుకూరు ఎమ్మెల్యే ఎన్ని కేసులైనా పెట్టుకోమని అన్నారు. కందుకూరు నియోజకవర్గం ప్రజలంతా ఎమ్మెల్యే నీబాగోతం చూస్తున్నారు,అడిగే వాళ్ళు లేరనుకుంటున్నావేమో, నీకేమన్నా కొమ్ములు వచ్చాయా ఏంటి అని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోని కలసి వినతి పత్రం ఇచ్చి డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ చేయించే వరకు మా న్యాయమైన పోరాటం కొనసాగుతుందని ప్రభుత్వానికి మా ఆగ్రహాన్ని నిరుద్యోగుల పోరాటం యొక్క తీవ్రతను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోపట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర్ రమేషు, లింగసముద్రం అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, వలేటివారిపాలెం అధ్యక్షులు అనుమోలు లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, గుడ్లూరు మండల అధ్యక్షులు కాపులూరి కృష్ణ, జిల్లా నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, బద్దిపూడి జయరావు, బిల్లా రమణయ్య, చీమల వెంకట రాజా, రావులకొల్లు బ్రహ్మానందం, రాజగోపాల్, సయ్యద్ ఫజల్, కర్పూరపు అశోక్, మద్దసాని నవీన్, తోట మల్లికార్జున, పాలవల్లి అమర్నాథ్ రెడ్డి,ఉచ్చులూరి రవీంద్ర,మర్లపాటి ఆదాము, కాపులూరి మధు, అమ్మనబోయిన బ్రహ్మయ్య, చింతలపూడి రవీంద్ర, కట్టా హనుమంతరావు, నల్లమోతు చంద్రమౌళి, ఆవుల మాధవరావు, యరమాల నాగభూషణం, గుత్తా గోపి, సాదు మాధవరావు, షేక్ రహీం,తల్లపనేని గోపి, యడ్ల మాధవరెడ్డి, మందలపు.మహేష్, ముప్పరాజు శ్రీనివాసులు, షేక్ అబ్దుల్ కలాం, తుళ్లూరి ఆదిలక్ష్మి, దేవరకొండ ఆదిలక్ష్మి, కొత్తగొర్ల వసంత లక్ష్మి, అత్యాల బుజ్జమ్మ, గడ్డం అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.





# డిఎస్సీ అక్రమాలపై భారీ ర్యాలీ

### ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకు హోరెత్తిన నిరసన
### వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు
### డీఎస్సీ అక్రమాల పై సమగ్ర విచారణ జరపాలి
### విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఆగస్టు 10)

డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఎర్రగొండపాలెం నియోజకవర్గం లో భారీ ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎర్రగొండపాలెం శాసనసభ్యులు , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిది తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత ఈ ర్యాలీలో పాల్గొని డీఎస్సీ అక్రమాల పై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విగ్రహం చేరుకున్న నాయకులు, కార్యకర్తలు సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

# నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు

## పోలీసు అధికారులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలు







**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 10)**

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. దర్శి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల పనితీరుపై సోమవారం అద్దంకి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐలు, ఎస్‌ఐలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ల వారీగా గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల నమోదు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు, పెండింగ్ కేసులపై ఎస్పీ సమీక్షించారు. అపరిష్కృత కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అరెస్టులు, చార్జిషీట్లు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు సంబంధించిన నేరాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా కృషి చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, పాత నేరస్థులు, చెడునడత కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రమాదకర మలుపుల వద్ద కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపైకి ప్రవేశించే సమయంలో వాహనదారులు ఇరువైపులా చూసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, కొత్త చట్టాలు, శిక్షలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. అద్దంకి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటి, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, సంతమాగులూరు సీఐ శేషగిరిరావు, దర్శి సీఐ రామారావు, సబ్‌డివిజన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భాను జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ రక్తదాన శిబిరం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)**

స్వర్గీయ కొట్టు భానుప్రకాష్ వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన పుట్టినరోజు సందర్భంగా భాను ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో త్రోవగుంట కమిటీ హాల్‌లో భాను మెమోరియల్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 40 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందించారు. భానుప్రకాష్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రాంబాబు, కోటి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాల పై కదంతొక్కిన యువత, విద్యార్థులు, వైఎస్సార్సీపీ శ్రేణులు

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 10)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే కె పి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్ నుండి పొట్టిశ్రీరాములు విగ్రహం మీదుగా రాచర్ల గేట్ సెంటర్‌లోని వైయస్ఆర్ విగ్రహం వరకు భారీ జనసందోహం మధ్య డీఎస్సీ అక్రమాలకు నిరసనగా ఆందోళన కార్యక్రమం




నిర్వహించారు. డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, ఈ వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో ఎంపిపిలు మేడురి వెంకట్రావు, వేగినాటి ఓసురరెడ్డి, జెడ్పీటీసీలు సారె వెంకట నాయుడు, పగడాల శ్రీరంగం, బండ్లమూడి వెంకట రాజయ్య, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి నెమలిదిన్నె చెన్నరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా కృష్ణరెడ్డి, రాష్ట్ర రైతు విభాగ ప్రధాన కార్యదర్శి సూరా స్వామి రంగారెడ్డి, రాష్ట్ర ఆర్టిఐ విభాగ ప్రధాన కార్యదర్శి కడప వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ విభాగ కార్యదర్శి వేమిరెడ్డి రామచంద్రరెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సంయుక్త కార్యదర్శి చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాశం జిల్లా పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షులు నన్నెబోయిన రవి కుమార్, జిల్లా ఎంప్లాయిస్ విభాగ అధ్యక్షులు పల్లెబోయిన వెంకటరాజు, సీనియర్ నాయకులు భూమా నరసింహారెడ్డి, అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట, గిద్దలూరు నగర పంచాయతీ, కొమరోలు, రాచర్ల మండల కన్వీనర్లు మానం బాలిరెడ్డి, ఏరువ రంగారెడ్డి, గొంగటి చెన్నరెడ్డి, ఆవుల శ్రీధర్‌రెడ్డి, మెరిగా రవి కుమార్, బత్తెం ఓబుల్‌రావు, యేలం మురళికృష్ణ, గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షులు, వివిధ స్థాయిలలో ఉన్నటువంటి అనుబంధ విభాగ అధ్యక్షులు, సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఒంగోలు యుటిఎఫ్ కార్యాలయంలో ఉదయం ఏడు గంటలకు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రవి మాట్లాడుతూ 1974లో ఏర్పడ్డ సంఘం 51 వసంతాలు ముగించుకుని 52వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సంఘ పటిష్టతకు కృషిచేసిన అమర జీవులను స్మరించుకుంటూ, సంఘ ఏర్పాటుకు దారి తీసిన ఆనాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ, సమకాలీన వర్తమాన విషయాలను చర్చించుకుంటూ, భవిష్యత్తు కార్యాచరణ వైపు కార్యక్రమాలు నడిచాయి. 1974 ఆగస్టు 10న ప్రాంతాలు యాజమాన్యాలు కేడర్లకు అతీతంగా సమైక్యత కోసం ఒక రాష్ట్రవ్యాపిత సంఘంగా ఒక చారిత్రక అవసరంగా యుటిఎఫ్ ఏర్పడింది అప్పటినుండి ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విద్యారంగ వికాసం కోసం అవినీతి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తూ విద్యారంగ పరిరక్షణకు విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తుందని అన్నారు అధ్యయనం అధ్యాపనం సామాజిక స్పృహ లక్ష్యాలుగా హక్కులు బాధ్యతలు రెండు నేత్రాలుగా పనిచేస్తూ ఉపాధ్యాయుల ఆదరాభిమానాలు చూరగొన్నదని అన్నారు అమర జీవులు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, దాచురి రామిరెడ్డి, ఎస్ఆర్ పోలిశెట్టి, షేక్ సాబ్జి, వలవల శ్రీరామమూర్తి, కలిదిండి రాఘవరాజు, తదితరుల స్ఫూర్తితో నిత్య నూతనంగా చైతన్యవంతంగా సమరశీలంగా పనిచేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాల పై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తున్నదని విద్యా కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణ విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాటం చేస్తున్నదని అమానుషమైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపిందని ఆయన అన్నారు విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు నాణ్యమైన మెటీరియల్ అందించడం, ప్రతిభ పాటవ పరీక్షలు నిర్వహించడం, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కుటుంబ సంక్షేమ సంఘం పథకాన్ని నిర్వహించడం ఒక్క యూటీఎఫ్ కే ఉన్న ప్రత్యేకతలని వివరించారు. భవిష్యత్తులో జరిగే అన్ని పోరాటాలలో ఉపాధ్యాయులంతా సమిష్టిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర సంఘం గత ఉద్యమ అనుభవాలను తీసుకొని టెట్ మీద ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించిందని ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలతో పాటు సర్వీస్ మేటర్ మరియు సంక్షేమం కోసం, టెట్ మీద జాతీయస్థాయిలో ఎస్టిఎఫ్ఐతో కలిసి పోరాటం చేస్తుందని తెలియజేసినారు రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన టెట్టు నిర్వహించాలని అందులో ఉపాధ్యాయుడు బోధించే అంశాలు మాత్రమే పరీక్షలో ఇవ్వాలని అందరికీ కామన్‌గా పాస్ మార్కులు ఇవ్వాలని ఎన్‌సిటిఈ యాక్ట్ 23(1) పార్లమెంటులో సవరణ చేయించాలని, ఆఫ్‌లైన్‌లో ఉపాధ్యాయులకు పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కామ్రేడ్ డి వీరాంజనేయులు, జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎన్ చిన్న స్వామి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా జీవి శేషయ్య, జి హరిబాబు, ఎస్ బ్రహ్మయ్య, కాట్రగడ్డ నరసింహారావు, టివి సుబ్బారావు, ఆర్ నారాయణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జయప్రకాష్, పి వెంకట్రావు, డి వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల రక్షణకు యూటీఎఫ్ నిరంతర పోరాటం





**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 10)**

ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా యూటీఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నిరంతరం పోరాడుతోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలిపారు. స్థానిక క్లబ్ రోడ్డులో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల యూటీఎఫ్ నాయకులు, శ్రేణుల భాగస్వామ్యంతో 52వ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1974లో ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక ఆర్థిక బకాయిల సాధనలోనూ, సర్వీసు సంబంధిత సమస్యల పరిష్కారంలోనూ సంఘం ఎన్నో విజయాలను అందించిందని పేర్కొన్నారు. గిద్దలూరు మండల ప్రధాన కార్యదర్శి గల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ' అనే ప్రధాన నినాదంతో యూటీఎఫ్ ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి మాధవి దేవి, సీపీఎస్ జిల్లా కన్వీనర్ ఆవుల రాజు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, గిద్దలూరు మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు రామచంద్రా రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, రాచర్ల మండల బాధ్యులు రఘురామ్, రంగారెడ్డి, కొమరోలు మండల బాధ్యులు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డితో పాటు జిల్లా కౌన్సిలర్లు మహానంది రెడ్డి, కృష్ణయ్య, మురళీధర్ రెడ్డి, ఈ వెంకటేశ్వర్లు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయం

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 10)**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు వేగవంతంగా చేరవేస్తూ, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత స్పష్టం చేశారు. సోమవారం మార్కాపురంలోని కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్ ) కార్యక్రమంలో అధికారులతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై అధికారులు ఎటువంటి అలసత్వం వహించకూడదని, అందిన ప్రతి అర్జీని నిర్దేశిత సమయానుకూలంగా, ప్రాధాన్యత క్రమంలో క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికే ప్రభుత్వం ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**222 అర్జీలు స్వీకరణ :** ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 222 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 170 అర్జీలు, ఇతర శాఖలకు (నాన్-రెవెన్యూ) సంబంధించి 52 అర్జీలు నమోదైనట్లు వెల్లడించారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు బదిలీ చేసి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, డ్వామా పీడీ సువార్త, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, ఐసిడిఎస్ ఇంచార్జి పీడీ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# మైదుకూరులో హోరెత్తిన వైసీపీ ర్యాలీ



## పోలీసు ఆంక్షలను లెక్కచేయని శ్రేణులు
## డీఎస్సీ అక్రమాల పై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలి
## మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి డిమాండ్







**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 10)**

కూటమి ప్రభుత్వంలో డిఎస్సీ ఎంపిక విధానం, పరీక్షల నిర్వహణలో భారీగా అక్రమాలు, అవినీతి జరిగాయని, వీటిపై వెంటనే సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ నిరసన ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**పోలీసుల ఆంక్షలు భగ్నం :**

ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు రాత్రికి రాత్రే నోటీసులు జారీ చేసి పలు ఆంక్షలు విధించినప్పటికీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా ముందుకు సాగారు. ఆదిలోనే ర్యాలీని భగ్నం చేసేందుకు పోలీసులు యత్నించినప్పటికీ, నాయకులు, కార్యకర్తలు ఎదురొడ్డి ప్రదర్శనను విజయవంతం చేశారు.

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే :**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ డిఎస్సీ సెలెక్షన్, నోటిఫికేషన్ ప్రక్రియలో ఎన్నో అవినీతి అక్రమాలు జరిగాయని విస్పష్టమైన ఆధారాలతో ప్రభుత్వ దృష్టికి తెచ్చినా స్పందించలేదని మండిపడ్డారు. దాదాపు 330 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. హైకోర్టు సమగ్ర విచారణ జరిపి దోషులను తేల్చాలంటే పోలీసుల కౌంటర్ దాఖలు కీలమని, అయితే ఈ ప్రభుత్వంలో పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరుపుతారనే నమ్మకం లేదన్నారు. అందుకే మొదటి నుంచి సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని, అప్పుడే అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి: వారం రోజుల ముందే సమాచారం ఇచ్చి శాంతియుతంగా నిరసన తెలపాలని భావిస్తే, రాత్రి 7:30 గంటలకు పోలీసులు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్యబద్ధమైనవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ధ్వజమెత్తారు.

**రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యం :**

శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రతను విస్మరించిన ప్రభుత్వం, కేవలం రాజకీయ ప్రతీకార చర్యల కోసమే పోలీసు వ్యవస్థను వాడుకుంటోందని ఆరోపించారు. పోలీసుల ఆంక్షలు, అడ్డంకులను ధిక్కరించి ర్యాలీని దిగ్విజయం చేసిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, శ్రేణులకు రఘురామిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

---

## సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి
## జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 10)**

వికసిత భారత్, స్వర్ణాంధ్ర -2029 లక్ష్యాలను అధిగమిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తితో కడపను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధీ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ డాక్టర్ నిధి మీనా డిఆర్వో మల్లికార్జునుడు తోకలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. వికసిత భారత్ లక్ష్యాలను అధిగమిస్తూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తితో వైఎస్ఆర్ కడప జిల్లాను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. పీజీఆర్ఎస్ పై ప్రజల అభిప్రాయాలను తప్పక స్వీకరించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సమస్యలకు తావులేని స్వేచ్ఛాయుత జీవనాన్ని జిల్లా ప్రజలకు అందించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా 2029 రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జేసీ అధికారులకు సూచించారు. ఇందుకోసం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, ఎస్డీసీ వెంకటపతి, డిప్యూటీ కలెక్టర్లు శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

---

## నా కుటుంబాన్ని హతమారుస్తారని బెదిరిస్తున్నారు
## వారి పై చర్యలు తీసుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)**

ఇస్లాం పేటకు చెందిన ఒక మహిళ పై దాడి చేసిన కేసులో కేసు వాపస్ తీసుకోవాలని లేకపోతే నా కుటుంబాన్ని హతమారుస్తారని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇస్లాంపేటకు చెందిన షేక్ ఫాతిమాబీ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. నగరంలోని ఎంసీఏ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో ఆమెకు జరిగిన విషయాల పై మాట్లాడారు. 2013 వ సంవత్సరంలో నా ఇంటిపై దాడి చేశారని అప్పట్లో రెండో పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయిందని అన్నారు. ఆ కేసు వాపస్ తీసుకోవాలని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ను పిలిపించి మాట్లాడారని అది వాపస్ తీసుకుంటే 12 కేసులు రద్దు చేయడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారని నా ఒక్క కేసు వాపస్ తీసుకోకపోతే కొదమకేసుల పరిష్కారం చేసుకోవచ్చు కదా అని అన్నారు. హైకోర్టు న్యాయవాది ఒకరు తనకు ఫోన్ చేసి హైకోర్టుకు హాజరుకావాలని చెప్పారని వేరే వారిపై కేసు పెడితే నన్ను కోర్టుకి రమ్మంటూ నన్ను బెదిరింపులు గురి చేయడమేనని అన్నారు. వారు చేస్తున్న బెదిరింపులకు తట్టుకోలేక గత శుక్రవారం సూసైడ్ చేసుకున్నానని దానిపై ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని అన్నారు. తనపై దాడి చేసిన వారి వలన తనకు ప్రాణహాని ఉందని తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

---

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి బీజేపీ వినతి

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 10)**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు, మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షులు పివి కృష్ణారావు సూచనలతో గిద్దలూరులో జనతా వారిది కార్యక్రమాన్ని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. గిద్దలూరు




పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోడ్లపై అక్రమంగా వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని కోరారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాదుల్ల మార్కెట్ యార్డు డైరెక్టర్ ముప్పూరి శ్రీనివాసులు, బిజెపి నాయకులు నాగేశ్వరరావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ పాండు, బిజెపి నాయకులు సుబ్బరాయుడు, శివ కుమార్‌రెడ్డి, బాజీ, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# ఫాసిస్టు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మరో 'క్విట్ ఇండియా' ఉద్యమం నిర్మిద్దాం

## రైతు, కార్మిక, విద్యార్థి ఉద్యమాల ఐక్యతతో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
## జైల్ భరోలో భాగంగా ఒంగోలులో రాస్తారోకో
## రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకుల అరెస్టు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)**

దేశంలో కార్పొరేట్ అనుకూల విధానాలు, ప్రజా వ్యతిరేక చట్టాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలతో సాగుతున్న ఫాసిస్టు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలోని క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో మరో దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం, విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తితో రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా ఉద్యమిస్తేనే ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించగలమన్నారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన 'జైల్ భరో' కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో భారీ నిరసన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఎంఎస్ సాయి అధ్యక్షతన జరిగిన సభ అనంతరం ప్రకాశం భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పూచీకత్తుపై విడుదల చేశారు. అఖిల భారత కిసాన్ సంఘ జాతీయ అధ్యక్షుడు రావెళ్ల వెంకయ్య మాట్లాడుతూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ల (ఎఫ్‌టీఏ) పేరుతో కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకుని దేశ వ్యవసాయాన్ని కార్పొరేట్ల చేతుల్లోకి నెడుతోందని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల 13 నెలల పోరాటంతో మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నప్పటికీ, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు సి2ం50 శాతం గిట్టుబాటు ధర అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేసే ప్రభుత్వం రైతులకు న్యాయమైన ధర కల్పించలేదని ప్రశ్నించారు. ల్యాండ్ అక్విజిషన్ స్థానంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో వేలాది ఎకరాల భూములను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం, నీట్ విద్యార్థుల ఉద్యమం స్ఫూర్తితో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జుజ్జూరి జయంతిబాబు మాట్లాడుతూ రైతుల భూములను పరాధీనం చేసే చట్టాలు రూపొందించి పరిశ్రమల పేరుతో కంపెనీలకు వేలాది ఎకరాలు కట్టబెడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై అమెరికాకు జూనియర్ భాగస్వామిగా వ్యవహరిస్తూ దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని దెబ్బతీస్తోందన్నారు. రూ.90 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం తెచ్చిపెట్టే పొగాకు రైతుల సమస్యను పూర్తిగా విస్మరించి తక్కువ ధరలకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమాలను విస్తరించాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ జిల్లాలో 50 వేలకుపైగా కుటుంబాలకు జీవనాధారమైన పొగాకు సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. భారీ పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కో బేరన్‌కు 5లక్షల రూపాయల నష్టాలు చవిచూస్తున్నప్పటికీ కిలోకు స్వల్ప బోనస్ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. రైతు సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ పనిదినాలు, నిధులు తగ్గించారని, రెండు నెలలుగా కూలీలకు వేతనాలు చెల్లించలేదన్నారు. గ్రామీణ పేదల కొనుగోలు శక్తి పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, ఉపాధి హామీ, ఆహార భద్రతా చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచిందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.6 వేల కోట్లతో నిర్మించిన రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, విశాఖ ఉక్కుకు అవసరమైన ఇనుప ఖనిజాన్ని ఇవ్వకుండా యరజర్ల, వలేటివారిపాలెం ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూమిని జిందాల్ కంపెనీకి అప్పగించే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. వాన్‌పిక్ పేరుతో సేకరించిన భూముల్లో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. రైతు కూలి సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, అఖిల భారత రైతు కూలి సంఘ జిల్లా అధ్యక్షుడు కోడూరి నాంచార్లు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు చట్టబద్ధ హక్కులు, నిరుద్యోగ సమస్య పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేత కోసం ప్రజలంతా ఐక్య ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ సాగర్, ఎస్‌కే మాబు, టి.శ్రీకాంత్, వి.బాలకోటయ్య, వి.హనుమారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, కె.రమాదేవి, పి.కల్పన, ఈదర అన్నపూర్ణ తదితర రైతు, కార్మిక, మహిళా, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## ఎల్‌నినో ప్రభావంతో వేరుశనగ, మామిడి పంటల పై కంబాట్ టీమ్ క్షేత్రస్థాయి పరిశీలన





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 10)

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా వేరుశనగ, మామిడి పంటల పై ఏర్పడే ప్రభావాన్ని అంచనా వేయడంతో పాటు, చీడపీడలు, తెగుళ్ల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన కంబాట్ టీమ్ మొటుపల్లి ఆర్‌ఎస్‌కే పరిధిలోని వేరుశనగ , మామిడి తోటలను సందర్శించింది. ఈ పర్యటనలో డాక్టర్ కె అచ్యుత్‌రాజుఎరువాక కేంద్రం కోఆర్డినేటర్, బాపట్ల, డాక్టర్ ఎన్ కామాక్షి ఎంటమాలజీ శాస్త్రవేత్త, ఏఆర్ఎస్, బాపట్ల, డాక్టర్ వి వాసుదేవరావు సైంటిస్ట్, పీహెచ్‌టీసీ బాపట్ల, వరదానమ్మ, ఏపీసీఎన్ఎఫ్ పాల్గొని పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, వర్షపాతం లోపించడం లేదా వర్షాల పంపిణీలో మార్పులు, నేలలో తేమ తగ్గడం వంటి పరిస్థితులు వేరుశనగ, మామిడి పంటలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని తెలిపారు. వేరుశనగ పంటలో నేలలో తేమ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, పంట కీలక దశల్లో తగినంత తేమ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమలో మార్పుల కారణంగా తామర పురుగు, పేనుబంక, ఆకు మచ్చ తెగులు తదితర చీడపీడలు, తెగుళ్లు ఉధృతమయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. చీడపీడలు ఆర్థిక నష్టపరిధిని దాటినప్పుడు మాత్రమే శాస్త్రీయ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మామిడి పంటలో అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణంలో తేమ మార్పుల కారణంగా పూత, పిందె దశలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున తోటల్లో తేమను సంరక్షించుకోవాలని సూచించారు. మామిడిలో తేనెబంక, త్రిప్స్, పూత, పిందెకు సంబంధించిన తెగుళ్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ, సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు అవసరానికి మించి నీరు, ఎరువులు, పురుగుమందులను వినియోగించకుండా పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా వినియోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. పంటలలో కనిపించే చీడపీడలు, తెగుళ్లను ముందుగా గుర్తించి, వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయశాఖ అధికారుల సలహా మేరకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని తెలిపారు.రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వేరుశనగ, మామిడి పంటలను క్రమం తప్పకుండా పరిశీలించి, సమస్యలు గుర్తించిన వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావ పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తలు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మండల వ్యవసాయ అదికారి చంద్ర శేఖర్, రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిల వసూలుకు ఈ నెల 13న ప్రత్యేక డ్రైవ్

### మైదుకూరు సబ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రత్యేక అధికారుల పర్యటన

### సకాలంలో చెల్లించకుంటే విద్యుత్ కనెక్షన్లు రద్దు

### ఈఈ డి లక్ష్మీపతి

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 10)

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల వసూలుకు ఈ నెల 13వ తేదీన గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఈఈ డి లక్ష్మీపతి తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, వనిపెంట సెక్షన్ల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల వినియోగదారుల నుంచి కోట్ల రూపాయల బకాయిలు రాబట్టాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులతో కార్యాచరణ రూపొందించామని, మంగళవారం నుంచి విద్యుత్ సిబ్బంది ప్రతి కాలనీలో పర్యటించి బకాయిలు వసూలు చేస్తారని వెల్లడించారు. ప్రతి నెల బిల్లులు అందిస్తున్నా చెల్లించని సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఎక్కువ బకాయిలు ఉన్నవారు వాయిదాల ఇన్‌స్టాల్‌మెంట్స్ పద్ధతిలో చెల్లించవచ్చు. ప్రభుత్వం ఇచ్చే నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పరిమితి దాటిన వారు తప్పనిసరిగా బిల్లు చెల్లించాలి. వినియోగదారులు, స్థానిక నాయకులు మరియు ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖకు సహకరించి బకాయిలు చెల్లించేలా చూడలని ఈఈ లక్ష్మీపతి విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అడ్డంకులు తొలగించాలి నూజిళ్లపల్లి దళితవాడ గ్రామస్తుల డిమాండ్

### ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం లికలెక్టర్‌ను కలిసి వినతి

### ఆర్డీవో, డీఎస్పీలతో విచారణకు ఆదేశాలు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

మండలంలోని నూజిళ్లపల్లి గ్రామంలోని దళితవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు దళితులు చేస్తున్న ప్రయత్నాలకు కొందరు వ్యక్తులు అడ్డంకులు సృష్టిస్తున్నారని, దీని పై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని నూజిళ్లపల్లి దళితవాడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజిళ్లపల్లి దళితవాడ గ్రామస్తులు ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు లికుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ అధ్యక్షత వహించారు. ధర్నా ప్రారంభంలో గ్రామంలోని జరిగిన సంఘటనను వారి యొక్క డిమాండ్ విప్పర్ల రామారావు తెలియజేశారు. గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడానికి గతంలో గ్రామస్తులు నిర్ణయించుకున్నామని ఇందుకు సంబంధించి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 133లోని ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునే విషయంలో కొందరు వ్యక్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ గ్రామంలో వివాదానికి కారణమవుతున్నారని తెలిపారు. అనంతరం ఈ ధర్నాకు హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్య తలెత్తదని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పట్ల గౌరవంతోనే దళితులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నారని వారు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామస్తులు కోరుతున్న ఈ అంశాన్ని అధికారులు సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వాలు లేస్తే దళితుల సంక్షేమం గురించి మాట్లాడేటటువంటి వారు వారు అడుగుతున్నటువంటి న్యాయమైన కోరికను కూడా పరిశీలించి పరిష్కరించాలని వారు కోరారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్ర రావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లికంకణాల ఆంజనేయులు రాష్ట్రంలో అనేక విగ్రహాలు పెడుతున్నారని అయితే వాటన్నిటికీ అనుమతుల తోనే పెడుతున్నారా అని ప్రశ్నించారు. కేవలం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టించుకోవాలంటేనే అనుమతి కావాలంట అమానుషం అని అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలనే ఆకాంక్షను అడ్డుకోవడం ఏమిటని అలా అడ్డుకున్న వారి పై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పెట్టాలని వారు కోరారు. ప్రభుత్వ స్థలంలో గ్రామపంచాయతీ పరిధిలోని మాలపల్లి కి వెళ్లే దారిలో విగ్రహ నిర్మాణం చేసుకుంటామంటే అనుమతి పేరుతో ఆటంకం పరచడం వివక్షత అని వారు తెలియజేశారు. డాక్టర్ జి చారువాక రాష్ట్ర అధ్యక్షులు అంటరాని తన నిర్మూలన పోరాట సమితి చైర్మన్, చిట్టి మాల సంపత్ దళిత మహాసభ రైతు సంఘం నాయకులు తల్లపనేని రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి విగ్రహ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కె వి కృష్ణరావు, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం వివిధ సందర్భాల్లో మండల జిల్లా స్థాయి అధికారులకు విన్నపాలు చేసిన పట్టించుకోని నేపథ్యంలోనే దళితులు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం నెలకొల్పారని అక్కడ అనుమతి అనే పేరుతో అంబేద్కర్‌ని అరెస్టు చేసినట్లు విగ్రహాన్ని తీసుకుపోయి ఎమ్మార్వో ఆఫీస్‌లో పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే నూజిల్లపల్లి దళితవాడలో అంబేద్కర్ విగ్రహానికి ఆర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వారు కోరారు. ఎస్కే మాబు సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నూజెండ్ల పల్లి లోని మాలపల్లె వద్ద సర్వే నంబర్ 133లోని స్థల పరిస్థితిని పరిశీలించి, దళితుల యొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, చట్టపరమైన విధానంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నూజిళ్లపల్లి దళితవాడ అడుగుతున్న న్యాయమైన డిమాండ్ సాధన కోసం సిపిఎం కట్టుబడి ఉంటుందని తెలియజేశారు. అనంతరం ప్రకాశం జిల్లా కలెక్టర్ గారిని ప్రతినిధి బృందంగా కలవడం జరిగింది. వారు త్వరితగతని సమస్య పరిష్కరిస్తామని ఆర్డిఓ, డీఎస్పీలతో ఎంక్వయిరీ చేయిస్తామని తక్షణమే సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ ధర్నాకి ముందుగా అంబేద్కర్ భవనం నుండి చర్చి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నూజిల్లపల్లి దళితులు మాలపల్లి వద్ద ఆర్చి నిర్మాణం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణం చేపట్టాలని దానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కంచర్ల సురేష్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, దళిత హక్కుల పరిరక్షణ సమితి ప్రకాశం జిల్లా అధ్యక్షులు అంజయ్య, నాయకులు దారా అంజయ్య, రవి, మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుళ్ళిబెల్లి అశోక్, జిల్లా నాయకులు ఏడుకొండలు, నూజెండ్లపల్లి గ్రామస్తులు బెజ్జం రమేష్, సానికొండ హనుమంతరావు, శానం సుబ్బారావు, విప్పర్ల రామారావు, ఇప్పర్ల భాను ప్రకాష్, పిప్పర్ల హేమంత్, కవల నరేష్, బెజ్జం రజిని, ఎద్దు రమాదేవి, ఇప్పర్ల ఎలిసమ్మ, నూతలపాటి మనీ, బెజ్జం కరుణ, తదితరులు పాల్గొన్నారు.

## ఐరన్‌ఓర్ పై వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తాం

### ఖనిజ సంపదలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

### ఐరన్ ఓర్ ప్రదేశాన్ని పర్యటించిన సిపిఐ బృందం



(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, ఆగస్టు 10)

ఐరన్ మోర్ పై వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తాం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. దేశంలోని ఖనిజ సంపదలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచుకొని ప్రజలకు మేలు కలిగేలా చూడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వలేటివారిపాలెం మండల పరిధిలోని పోలినేని చెరువు అయ్యవారిపల్లి చుండి పరిసర ప్రాంతాలలోని ఐరన్ ఓర్ ఖనిజ సంపదను సిపిఐ బృందంతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఖనిజ సంపదను జిందాల్ వంటి ప్రవేటు కంపెనీ లకు అప్ప చెప్పటం సిపిఐ గా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. కనీసం గ్రామసభలను కూడా పెట్టకుండా ఖరీజ సంపదను జిందాల్ లాంటి ప్రైవేటు కంపెనీలకు ధారాధత్వం చేశారంటే దాని వెనక మర్మమేమిటో అందరికీ అర్థమవుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే పోరినేని చెరువు, చుండి అయ్యవారిపల్లి పరిసర ప్రాంతాలలో ఉన్న ఐరన్ ఓర్ ఏ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్ అనేది తెలుసుకునేందుకు పనులు కొనసాగించారని ఆయన అన్నారు. వెంటనే ఐరన్ ఓర్ ను విశాఖ ఉక్కు కర్మాగారానికి అప్పచెప్పి రాష్ట్ర ప్రజలకు మేలు కలిగేలా చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో దీనిపై కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమ బాట పడతామని ఆయన హెచ్చరించారు. ఏదైనా గ్రామంలో ప్రభుత్వ పరంగా ఒక పని చేయాలంటే గ్రామ ప్రజల అభిప్రాయం ముఖ్యమని అది కూడా చేయకుండా ఏకపక్ష నిర్ణయంతో గత వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తే తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం సైతం వాటాలు వేసుకుంటూ జరిగిన తప్పును సరిదిద్దకుండా కళ్ళు మూసుకుని ముందుకు పోవడం సరైనది కాదని ఆయన మండిపడ్డారు. అటవీ భూములు ప్రభుత్వ భూములు ప్రైవేటు భూములు అన్ని కలగలిసి ఉన్న ప్రాంతాల్లో ఎవరి అనుమతులు లేకుండా మనము చేపట్టటం సరైనది కాదని మేము వెంటనే పర్యావరణ శాఖ అధికారులకు మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఐరన్ ఓర్ వంటి ఇనుప కణజాన్ని ప్రైవేటు పరం చేయటం ప్రజల ధనాన్ని దోచుకోవడమేనని ఆయన అన్నారు. దేశ సంపదను ప్రభుత్వ ఆధీనంలో పెట్టుకొని ప్రజల సంక్షేమానికి వినియోగించాలి తప్ప ప్రైవేటు పరం చేయటం దుర్మార్గమైన చర్యని ఆయన అన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని విశాఖ ఉక్కు కర్మాగారానికి ఈ ఇనుప ఖనిజ సంపదను అప్పజెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, సిపిఐ నాయకులు వై ఆనందమోహన్, కే మురళి, కే రామమూర్తి, కె మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఇంటింటికి టీడీపీ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 10)

నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, మైదుకూరు మున్సిపాలిటీ 6వ వార్డులో "ఇంటింటికి టీడీపీ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాకెట్ రఫీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పెద్దయ్య, 5వ వార్డు ఇన్‌చార్జ్ షేక్ అల్తాఫ్ హుస్సేన్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షైక్ ఆసీఫ్ హుస్సేన్, తెలుగు యువత ఉపాధ్యక్షులు శివరామ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలి

### జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 10

ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యల పై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 142 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పోలీస్‌శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ప్రజల నుండి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటి పై సంబంధిత పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్ సుధాకర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం

**నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం**

**కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా వల్లం కొండు వెంకటరమణ ప్రమాణ స్వీకారం**

**టీజీ వెంకటేష్‌కు క్రేన్ తో గజమాల వేసి స్వాగతం పలికిన సొల్లేటి వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు, కమిటీ**

**జిల్లా నలుమూల నుండి ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కదం దక్కిన ఆర్యవైశ్యులు**




















**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 10)**

బద్వేల్ పట్టణంలోని చెన్నంపల్లి సమీపంలో ఉన్న ఆర్ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీగా సివి నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పబ్బుతి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెలిశెట్టి ప్రసాద్, మహిళ కమిటీ అధ్యక్షురాలుగా రాజా వెంకట వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కుంజేటి అరుణ, కోశాధికారిగా దేవత లలిత, యువజన సంఘం అధ్యక్షులుగా సన్నుతి హేమన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంతు సతీష్, సెక్రటరీగా అయ్యప్ప, మనోజ్, కోశాధికారిగా పైడిమర్రి సురేష్ బాబు, వాసవి సేవా అధ్యక్షులుగా గాజులపల్లి హరి గోపాల్, సెక్రటరీగా రెడ్డి సురేష్, ట్రెజరర్‌గా నాగ అభిరామ్ ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అట్టహాసంగా మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి మాటూరు రంగనాథ్, మహాసభ గౌరవ అధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు, మహాసభ ఉపాధ్యక్షులు పబ్బిశెట్టి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు శ్రేష్టి, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు శ్రేష్టిలకు ఘన స్వాగతం లభించింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సొల్లేటి రమణ నేతృత్వంలో క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి అతిథులను సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ, కమిటీ సభ్యులు ప్రత్యేక కోలాటాలు, భజంత్రీలు, వేద పండితుల పూర్ణకుంభ స్వాగతంతో శోభాయాత్రగా సభా ప్రాంగణానికి తీసుకెళ్లారు. జ్యోతి ప్రజ్వలన, అమ్మవారి ప్రార్థనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వల్లంకొండు వెంకటరమణ, వారి కార్యవర్గం చేత ఆర్యవైశ్య మహాసభ నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజా వెంకట వరలక్ష్మి మరియు వారి కార్యవర్గంతో ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కే. రజిని, ప్రధాన కార్యదర్శి ఏ. సాయి నికిత, కోశాధికారి గంగా నాగ సుప్రజ ప్రమాణ స్వీకారం చేయించారు.

**ఐకమత్యంతోనే గుర్తింపు**
**టీజీ వెంకటేష్ పిలుపు**

అనంతరం జరిగిన సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్యవైశ్యులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఐక్యత ఉన్నప్పుడే సమాజంలోనూ, అన్ని రాజకీయ పార్టీల్లోనూ తగిన గౌరవం లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు అవకాశాలు కల్పించాలని, వ్యాపార రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వచ్చే ఆర్యవైశ్యులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ద్వారా పూర్తి అందిస్తామని హామీ ఇచ్చారు. క్షేమానికి, కష్టాల్లో ఉన్న వైశ్యులను ఆదుకోవడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన కడప జిల్లా**

మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ, కడప జిల్లాలో ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఘనంగా జరగడం అభినందనీయమన్నారు. సంఘం సభ్యత్వ నమోదులో కడప జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం వెనుక జిల్లా అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ కృషి ఎంతో ఉందన్నారు. విజయవాడలో నిర్మిస్తున్న ఆర్యవైశ్య భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయంగా ఏ పార్టీలో ఉన్నప్పటికీ సంఘం విషయానికి వచ్చేసరికి ఐకమత్యంగా ఉండాలని సూచించారు.

**భారీగా తరలివచ్చిన బంధుమిత్తులు**

ఈ మహోత్సవంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరు రంగనాద్, రాష్ట్ర మహాసభ ఐటీ అండ్ మెంబర్షిప్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ చక్క సూర్యప్రకాష్, బైలాస్ కమిటీ చైర్మన్ చెక్క చెన్నకేశవరావు రాష్ట్ర కార్యదర్శి పేరూరు గాంధీ, కడప జిల్లా సంఘ గౌరవాధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, కుప్పం వెంకట సుబ్బారావు, స్టేట్ సెక్రటరీ కొండపల్లి చిన్న సుబ్బారావు స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు చిప్పగిరి వెంకట ప్రసాద్, టంగుటూరి మారుతి ప్రసాద్ మీడియా కమిటీ స్టేట్ వైస్ చైర్మన్ గోగుల శ్రీనివాసరావు, ఓబులశెట్టి రాధాకృష్ణ కొణతాలపల్లి నరసింహులు, రామసుబ్బయ్య సొల్లేటి వెంకటరమణ మున్సిపల్ మాజీ వైఫ్ చైర్మన్ అడుగుతా సాయి కృష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనుమరుల పుటీ ప్రసాద్, పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కమిటీలోని దాదాపు 700 మందికి పైగా పలువురికి శాలువాలు కప్పి ప్రమాణ స్వీకార పత్రాలు అందజేసి పెద్దల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేపించడం జరిగింది అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో పలువురు పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డ్ చైర్మన్ ఘన సన్మానించిన
# కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు











**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 10)**

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన బద్వేల్ పట్టణానికి చెందిన వల్లం కొండు వెంకటరమణను సోమవారం బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ నారిశెట్టి సుప్రజ, బిజెపి సీనియర్ నాయకులు నాగేంద్ర, డైరెక్టర్ చిన్ని సుబ్బారావు పలువురు డైరెక్టర్లు వారి స్వగృహం వద్దకు వెళ్లి నూతన అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణకు శాలువ పూలమాలతో సత్కరించి కలియుగ ప్రత్యక్ష దైవమున శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి వారికి అభినందనలు తెలిపారు, అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిసెట్టి సుప్రజ నాగేంద్ర తో పాటు పలువురు డైరెక్టర్లకు వల్లంకొండు వెంకటరమణ శ్రీమతి ధనలక్ష్మి కుటుంబ సభ్యులు గౌరవ అధ్యక్షులు కె,వి సుబ్బారావు ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్ తోపాటు పలువురు శాలువాతో పలువుని సత్కరించడం జరిగింది, అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజా మాట్లాడుతూ బద్వేల్ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బద్వేల్ ప్రాంతంలో పలువురి ఆదర అభిమానాలు పొందిన వల్లంకొండు వెంకటరమణ రాబోవు రోజుల్లో రాష్ట్రా స్థాయిలో మరెన్నో పదవులు అలంకరిశీచాలని వారి ఆకాంక్షించారు.

**నూతన కమిటీకి ఫ్రెండ్స్ కమిటీ ఘన సన్మానం :** కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా నియమితులైన వల్లశీ కొండు వెంకటరమణ, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, సేవాదళ్ మండల సంఘం అధ్యక్షులు తుమ్మలపెంట సుధాకర్‌తో పాటు పలువురికి ఫ్రెండ్స్ కమిటీ సభ్యులు భూమిరెడ్డి వెంకటేష్, పెద్ది సుధాకర్, బ్రహ్మదేవుని ఎర్రంరెడ్డి, పూనిపర్తి అనిల్ కుమార్ రాజు, పిఆర్ స్టూడియో సురేంద్ర, సునీల్ కుమార్, దీపక్, డ్రైవింగ్ స్కూల్ కాలువ చెన్నయ్య, గురు కాపీ కేఫ్ సుబ్బరాయుడుతో పాటు పలువురు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.